చల్లా రాధాకృష్ణ శర్మ



కోపాన్ని జయించిన సౌశీల్యం

[కవిచక్రవర్తి బిరుదాంకితుడైన కంబమహాకవి తన తమిళ రామాయణంలో తారను పరమ పవిత్రంగా అభివర్ణించాడు. వాలి మరణానంతరం ఆమె విరక్త మనస్కగా ఉండిపోయినట్లు ఆయన పేర్కొన్నాడు. ఆమె సౌశీల్యం ఆవేశపరుడైన లక్ష్మణుణ్ణి శాంతచిత్తుణ్ణి చేయగలిగింది. కంబకవి పేర్కొన్న యీ కథాంశం ఈ కథకు ఆధారం.]

వానలు వెనకపట్టాయి. ఆకాశం నిర్మలంగా ఉంది. చెట్టు చేమలు పచ్చపచ్చగా ఉన్నాయి. అక్కడక్కడ వాననీరు గుంటల్లో నిలిచివుంది.

ఒక చెట్టుమీద రెండుకోతులు కిచకిచ లాడుతున్నాయి; పోట్లాడుకుంటున్నాయి కాబోలు. ఆ చెట్టుకింద ఒక ముసలికోతికి పడుచుకోతి పేలు చూస్తోంది. ఎటు చూసినా కోతులే - చిన్నవీ పెద్దవీ పడుచువీ ముసలివీ. అది ఋశ్యమూకపర్వతం

ఒక బండమీద రెండు కోతులు. ప్రేయసీ ప్రియులు! సంతోషంలో మైమరచి వున్నాయి.

దానికి దగ్గర్లో ఉన్న పర్ణశాల ఆవరణలో ఒక తిన్నెమీద కూర్చుని రాముడు ఆకాశంవైపూ, పచ్చని చెట్టుచేమల వైపు మార్చి మార్చి చూస్తున్నాడు. కోతుల కిచకిచలూ, పక్షుల కలాకలారావం ఆ పరిసరాలకి సందడి కలిగిస్తున్నాయి. దూరాన మదగజ ఘీంకారాలు వినవస్తున్నాయి.

ఉన్నట్టుండి రాముడు 'లక్ష్మణా !' అన్నాడు సంతోషంకొద్దీ.

బదులు వినిపించలేదు.

'తమ్ముడూ, తమ్ముడూ...'

బదులు రాలేదు.

నామతి మరుపు బంగారంగాను ! కందమూలాల కోసం అడివి వెళ్ళాడు... వెళ్ళి చాలా సేపయింది... మరీ లోపలికివెళ్ళాడేమో పాపం, లక్ష్మణుడు నాకోసం ఎంతకష్టపడుతున్నాడు... పగలంతా సేవల్లోనూ కందమూలాల సేకరణలోనూ గడుపుతాడు...రాత్రిళ్ళు న్నమాయడు... కంటికి రెప్పలా నన్ను కాపాడుతున్నాడు .... క్ష్మణుడి ఋణం నేనెన్ని జన్మలెత్తినా తీర్చుకోలేను...అనుకున్నాడు ముడు.

ఇంతలో బండమీది కోతులు కిచకిచలు మరీ ఎక్కువ కావడంతో మిటా అని రాముడు ఆవైపు చూశాడు. అవి భయంతో వణికి తున్నాయి.

ఆ బండ వైపుగా మదగజం ఒకటి పరుగెత్తుకుంటూ వస్తోంది. రిలో అడ్డం వచ్చిన చెట్టు, చేమల్ని తొండంతో నేలమట్టం చేస్తోంది. లా నేలకూలిన చెట్లమీది పులుగులూ పిట్టలూ కోతులూ ప్రాణాలు ప్పెట్లో పెట్టుకుని పరుగులు తీస్తున్నాయి. పరుగెత్తలేని ముసలి తులు కొన్ని ఏనుగు కాళ్ళకిందపడి నలిగిపోతున్నాయి. ఆ దృశ్యం సే బండమీద కోతులు గజగజ వణికిపోతున్నాయి.

అంత వరకూ సంతోషంగా ఉన్న కోతులు అలా వణికిపోవడం సి రాముడు వాటి మీద జాలిగొన్నాడు. వెంటనే బాణం సంధించి ల్లు ఎక్కుపెట్టాడు. అంతే; మదగజం వెనక్కి తిరిగిపోయింది, మెల్లమెల్లగా.

బండమీది కోతులు రాముడి వంక కృతజ్ఞతాపూర్వకంగా చూశాయి ఆ చూపు...రావణుడి కబంధహస్తాలకు చిక్కుకుని భయవిహ్వల అయిన సీత జటాయువుని చూసిన చూపుగా కనిపించింది....కింద తిరుగుతున్న కోతుల్ని చూసి నగలమూటను కిందికి విసిరివేసిన సీత చూపుగా కనిపించింది....

సీతా...ఆరోజు నువ్వెంత బాధ పడ్డావో యేమిటో! అది తలచుకుంటేనే మనస్సు వికలమై పోతోంది. ఆ రాక్షసుడి బారినుంచి నిన్ను కాపాడాలని జటాయువు తన శక్తినంతా వినియోగించాడు... చివరికి తన అసువులనే కోల్పోయాడు పాపం...రాక్షసశక్తే జయించింది. రాక్షసశక్తిని సర్వనాశనంచేస్తాను. అది నశిస్తేనే నా మనస్సుకి తృప్తి, లోకానికి శాంతి...సీతా, నీ మీద ఒట్టు సీతా...సీతా... అనుకుంటూ రాముడు మనస్సునంతా సీత మీద లగ్నం చేశాడు. విశ్వామిత్రుడు, జనకుడు...గుర్తుకి వచ్చారు. పాణిగ్రహణమహోత్సవానికి ముందు తాను సీతను చూసిన ఆ చూపు, ఆ తర్వాత ఆమె తనను చూసిన ఆ చూపు, ఆ చూపుల్లోని అమృతాన్ని మించిన తీపి, ప్రేమను మించిన తీపి, తీపిని మించిన తీపి...

కందమూలాలు తీసుకువస్తున్న లక్ష్మణుడు దూరంనుంచి చూశాడు తనను పర్ణశాలను. తలుపు తెరచివుంది. రెండు కోతులు గుమ్మం దగ్గిర కూర్చుని ఉన్నాయి. పక్కనేవున్న ఒక చిన్నగుట్ట ఎక్కి లక్ష్మణుడు నిశితంగా చూశాడు. రోజూ కూర్చునే అరుగుమీద రాముడు కనిపించలేదు. లక్ష్మణుడి గుండెలు వేగంగా కొట్టుకున్నాయి. నేను వచ్చేంతవరకూ అన్నయ్య ఎక్కడికీ వెళ్ళడే! తలుపేమో తెరచి వుంది. గుమ్మందగ్గిరేమో కోతులు...అనుకున్నాడు. మళ్ళీ ఏ రాక్షసుడు రాలేదుగదా!

లక్ష్మణుడు బాణంలా దూసుకువచ్చాడు సరాసరి పర్ణశాల లోపలికి వెళ్ళబోతుంటే కోతులు కిచకిచ మంటూ తిన్నె వద్దకు వెళ్ళాయి.

రాముడు అరుగుకి దగ్గరగా నేలమీద పడిఉన్నాడు. కట్టుకున్న వస్త్రానికి మట్టి బాగా అంటుకుని ఉంది. బుగ్గలు చారికలు కట్టి ఉన్నాయి కళ్లు ఎర్రగా ఉన్నాయి. కొంచెం వాచాయి కూడా!

అరుగు మీదనుంచి రాముడు కింద పడ్డాడా ? అవునన్నట్టుగా కోతులు కిచకిచ మన్నాయి.

'అన్నయ్యా! అన్నయ్యా!' ఆదుర్దాగా పిలిచాడు లక్ష్మణుడు.

రాముడు మెల్లగా కళ్లువిప్పాడు. తమ్ముణ్ణి ఆదరంగా చూశాడు.

'ఏమిటన్నయ్యా యిదంతా? అరుగు మీదనుండి కిందపడ్డావా? చూడు, కళ్లు ఎలా ఎర్రగా వాచిఉన్నాయో! ఎందుకన్నయ్యా, కంట తడి పెట్టావు? నేనుండగా నీ కేమీ భయం లేదు. వదిన తప్పకుండా కనిపిస్తుంది...?

రాముడు తల పైకెత్తి లక్ష్మణుడి కళ్లలోకి తొంగి చూశాడు.

'తప్పకుండా వదిన కనిపిస్తుందన్నయ్యా...నువ్వేమీ అధైర్య పడకు అని తమ్ముడు ధైర్యం చెబుతూ వుండగానే, రాముడి కళ్లలో నీళ్లు తిరిగాయి.

'అన్నయ్యా నా మీద ఒట్టు. నువ్వు కంటతడి పెట్టకూడదు...' రాముడి కళ్లు తుడిచాడు.

అన్నయ్యను అరుగుమీద కూర్చుండజేశాడు. తాను తెచ్చిన కందమూలాలను ముందుంచాడు. లోపలికి వెళ్లాడు.

ఎన్ని జన్మలెత్తినా యిలాంటి తమ్ముణ్ణి పొందలేను...అని లక్ష్మణుడి భ్రాతృప్రేమను తలచుకుని రాముడు మురిసి పోతుంటే అమ్ములపొదితో లక్ష్మణుడు వెలుపలికి వచ్చాడు పర్ణశాలలోంచి. ముఖంలో కోపం కనకనలాడుతోంది.

శ్రీఘ్రకోపి...అనుకున్నాడు రాముడు. అయినా లక్ష్మణుడి కోపానికి కారణమేమిటో ! అని ఆలోచిస్తూ తమ్ముడివంక చూశాడు, నవ్వు మొగంతో.

అది గ్రహించలేకపోలేదు రామానుజుడు. అంతకోపమూ అంతలోనే మాయమైపోయింది. పరమశాంతుడై యిలా అన్నాడు.

'చూడన్నయ్యా! సుగ్రీవుడు ఎంత కృతఘ్నుడో...అతడి పబ్బంగడిచిపోయింది. నిమ్మకి నీరెత్తినట్టుగా కూర్చున్నాడు. ఇచ్చిన బాసకూడా మరచిపోయాడు...వానాకాలం కాగానే కొండంత సహాయం చేస్తానన్నాడు....మళ్ళీ యిటువైపు తొంగిచూడలేదు. కడుపునిండా తాగి కమ్మగా నిద్రపోతున్నాడేమో. వెళ్ళి నిద్రమత్తు కాస్తా వదిలించి వస్తాను...రామబాణ మహిమని గుర్తుచేస్తాను...' ఉన్నట్టుండి ఆగిపోయాడు, మధ్యలో ఆవేశం తెచ్చుకుని చెప్పుకుపోతున్న లక్ష్మణుడు.

రాముడు గుడ్డిచాటు చేసుకుని విలపిస్తున్నాడు. 'తమ్ముడూ, సీత కనిపిస్తుందన్న ఆశ నాలో రోజు రోజుకీ ఎందుకో తగ్గిపోతోంది....' అన్నాడు కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ.

లక్ష్మణుడు ఏమీ మాట్లాడలేదు. కోపావేశంతో ముందుకి చరచర నడిచాడు. అరుగుమీదనుంచి లేచి తమ్ముడు నడిచివెడుతున్న వైపే చూడసాగాడు రాముడు.

పెద్దపెద్ద అంగలు వేసుకుంటూ లక్ష్మణుడు కిష్కింధ వైపు వెడుతున్నాడు. దారిలోని రాళ్ళూరప్పలూ కాళ్ళకింద నుగ్గునుగ్గు అవుతున్నాయి. నడుస్తున్న వేగానికి అమ్ములపొది అటూయిటూ ఊగిపోతున్నది. సుగ్రీవుణ్ణి ఏం చేస్తాడో యేమిటో అనుకున్నాడు, తమ్ముడి వాలకంచూసి.

లక్ష్మణుడు అగ్నిపర్వతంలా వస్తున్నాడన్న వార్త అప్పుడే అంచెలుఅంచెలుగా కిష్కింధకు వ్యాపించింది. భయగంపితులైన వానర వీరులు వెంటనే యువరాజు అంగదుణ్ణి సమీపించారు. అతనూ లక్ష్మణుడి రాకను గమనించాడు. ఆలస్యం చెయ్యకుండా సుగ్రీవుడి వద్దకు బయలుదేరాడు; ఆపద రానున్నట్టు గ్రహించాడు.

మద్యపాన నిరతుడైన సుగ్రీవుడు శయ్యాగృహంలో ఉన్నాడు, అంగదుడు సరాసరి అక్కడికే వెళ్ళాడు, ద్వారపాలకులు వారించినా లక్ష్మణుడి రాకను తెలియజేశాడు. అంతమద్యపానలోలుడూ లక్ష్మణుడి పేరు వినగానే హడిలిపోయి 'ఆ, ఆ' అన్నాడే కాని మరేమీ మాట్లాడలేకపోయాడు. ఇక లాభం లేదనుకొని అంగదుడు తనతల్లి తార వద్దకు బయలుదేరాడు. దారిలో హనుమంతుడు కలిశాడు. ఇద్దరూ తారను సమీపించారు.

వానర వీరుల ప్రవర్తన ఆమెకు నచ్చలేదు. మీరు కృతఘ్నులు రాములవారిని మరచిపోయారు. వానలు వెనక పట్టిన తర్వాత ఆయనకి సహాయం చేస్తామన్నారు. మీరు మీమాట నిలుపుకోలేదు. అందుకే లక్ష్మణుడు యిక్కడికి వస్తున్నాడు రాముడలా భార్యను కోల్పోయి బాధ పడుతుంటే, మీరేమో మీ విలాసాలలో మునిగి తేలుతున్నారు. ఇది మీకు ధర్మమేనా? రాముడి కోపానికి గురికావడం మనకు క్షేమం కాదు! అంది తార.

ఇంతలో అగ్ని పర్వతంలా ప్రతిభాసించే లక్ష్మణుడు అంతఃపుర ద్వారం సమీపించాడు. అది తెలుసుకున్న అంగదుడికి ఏంచెయ్యాలో తోచలేదు. తల్లిని చూచాడు.

అప్పటికప్పుడే కొందరు స్త్రీలను వెంటబెట్టుకుని తార బయలు దేరింది. లక్ష్మణున్ని సమీపించింది.

తన ముందు నుంచున్న స్త్రీ సమూహాన్ని చూసి అవనతవదనుడయ్యాడు లక్ష్మణుడు, లజ్జతో. మౌనం వహించాడు.

"రాములవారిని ఒంటరిగా విడిచిపెట్టి రామానుజులు యిక్కడికి రావడంలోని ఆంతర్యమేమిటో... ఏమైనా మాకిది శుభదినం. తమరాకతో మా రాజ్యం పరమపావన మయింది..."

ఎవరిదీ మధురకంఠం! వానరాంగనలకు కూడా ఇంత కంఠమాధుర్యం వుంటుందా! ఆ మాటల్లో ఎంత ఆప్యాయత! ఎంత అభిమానం! ఆశ్చర్యంలో మునిగిపోయాడు లక్ష్మణుడు. ఆ శ్రావ్యమైన కంఠస్వరంగల వానర స్త్రీని, రాముడిపట్ల గౌరవభావం ప్రదర్శించిన ఆ సుమతిని చూడాలనే తహతహ కలిగింది. అతడు మెల్లగా తల పైకెత్తాడు. బిడియపడుతూ ఆమెను చూశాడు.

ఆమె తెల్లని చీర కట్టుకుంది. ముఖంలో సహజమైన లక్ష్మి నుదుట కుంకుమబొట్టు లేదు. మెడలో ఆభరణాలు ఏవీ లేవు. మాంగల్య చిహ్నాలు కనిపించలేదు.

అయోధ్యలో నా తల్లులు తారలా యిలాగే వున్నారు కాబోలు- అనుకున్నాడు లక్ష్మణుడు. విచార వదనుడయ్యాడు. మనస్సు మనస్సులో లేదు.

'మా మరిదిగారు మిమ్మల్ని త్వరలోనే కలుస్తారు. మీకు తప్పకుండా సహాయం చేస్తారు.'

ఆ తర్వాత తార అక్కడినుంచి నిష్క్రమించింది.

తార పాతివ్రత్యం ఆమె కంఠమాధుర్యం, ఆమె మాటలతీరు... లక్ష్మణుడికి ఆమెపట్ల ఎనలేని ఆదరభావం కలిగించాయి.

అగ్నిపర్వతంలాంటి లక్ష్మణుడు మంచుకొండ అయ్యాడు.